
చినబాబూ.. ఇదిగో మీ బాబు హామీల చిట్టా!


- 2014లో కోసిగి బహిరంగ సభలో డజను హామీలు గుప్పించారు..
- అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కారు
- ఆర్డీఎస్, పులికనుమ ప్రాజెక్టు మాటే మరిచారు
- నియోజకవర్గ ప్రజలకు మీ నాన్న చేసింది శూన్యం



రూ.5.5 కోట్లతో నిర్మించిన కోసిగి-డి.బెళగల్ డబుల్ బీటీ రోడ్డు



కొనసాగుతున్న ఆర్డీఎస్ కుడిగట్టు కాలువ పనులు



జలకళతో పులికనుమ రిజర్వాయర్



మనబడి నాడు-నేడుతో హెచ్.మురవణి పాఠశాలలో సుందరంగా తరగతి గది

మంత్రాలయం : 2014 ఏప్రిల్ 25 .. ఈ తేదీ గుర్తుందా చినబాబు. మీ బాబు గారు సరిగ్గా ఇదే తేదీన కోసిగిలో బహిరంగ సభ నిర్వహించారు. ఎన్నికల ప్రచారం ఆఖరి రోజున డజను హామీలు గుప్పించారు. సరిగ్గా 9 ఏళ్ల తర్వాత అదే తేదీకి నువ్వొస్తున్నావు. భలేగా ఉంది.. తండ్రీకొడుకుల ప్రచార, పాదయాత్ర తేదీ.. యాధృచ్ఛికమో.. విధి ధర్మమో తెలీదు కానీ ఇద్దరూ ఇదే నెల 25న కోసిగి గడ్డపై బహిరంగ సభ ఏర్పాటు చేసుకున్నారు. కోసిగి యల్లమాంబ దేవి సాక్షిగా.. మీ నాన్న ఇచ్చిన మాటను నెలబెట్టుకోలేక పోయారు. ఐదేళ్లు ఎదురు చూసినా.. ఒక్కటంటే ఒక్కటీ నెరవేర్చలేదు. మీరొచ్చి ఇచ్చే హామీలు మళ్లీ ఏ మూలకు చేరుతాయోనని ఆందోళనగా ఉంది.

నాడు మీ బాబు (చంద్రబాబు నాయుడు) ఇచ్చిన హామీల చిట్టా..

1. తుంగభద్ర నది పొడవునా లెక్కలేనన్ని ఎత్తిపోతల పథకాలు నిర్మించి సాగునీటి కష్టాలు తీరుస్తా
2. వరద పోటు గ్రామాల రక్షణ కోసం ఫ్లడ్ వాల్ నిర్మాణం చేపడతా
3. తుంగభద్ర డ్యాం అధికారులతో మాట్లాడి ఆంధ్రాకు పూర్తిస్థాయి నీటి వాటా తెప్పిస్తా
4. ఫ్యాక్టరీలు నిర్మించి కూలీలకు ఉపాధి కల్పిస్తా
5. ప్రతి గ్రామానికి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి దాహం తీరుస్తా
6. ప్రతి మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తా
7. ఏడాది లోపు పులికనుమ ప్రాజెక్టు పూర్తిచేసి సాగునీరు అందిస్తా
8. నియోజకవర్గ ప్రజలకు 30 పడకల ఆసుపత్రి నిర్మిస్తా
9. ఆర్డీఎస్ కుడిగట్టు కాలువ నిర్మాణం చేపడతా..
10. బతకడానికి యువతకు వాహనాలు నేనే కొనిచ్చి ఇస్తా
11. పోలీసులకు ప్రత్యేక పీఆర్సీ ప్రవేశపెడతా
12. విలేకరులకు డబుల్ బెడ్ ఇళ్లు నిర్మించి ఇస్తా

ఈ డజను హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారా. ఐదేళ్ల పాలనలో ఆర్డీఎస్ కుడిగట్టు కాలువ సర్వేకు రూ.3.09 కోట్లు వెచ్చించి చేతులు దులుపుకున్నారు. కేవలం రూ.30 కోట్లు ఇస్తే పూర్తయ్యే పులికనుమ ప్రాజెక్టును గాలికి వదిలేశారు. నిరక్షరాస్యతలో దేశంలో కోసిగి మండలానిది మూడో స్థానం. ఒక్క డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలేదు. 112 గ్రామాల్లో కేవలం 45 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఊసే లేకుండా చేశారు. నది పొడవునా 20 తీర గ్రామాలు ఉండగా ఫ్లడ్ వాల్ ఎక్కడా నిర్మించలేదు. ఇక ఫ్యాక్టరీలు, డబుల్ బెడ్ రూములు, యువతకు వాహనాలు ఇవన్నీ గాలి మాటలుగా మిగిలాయి. అప్పట్లోనే ఆల్‌ఫ్రీ బాబు అంటుంటే ఏమో అనుకున్న జనానికి హామీలు నెరవేర్చకపోవడంతో ఇక్కడి వాళ్లకు కూడా అది నిజమనే తెలిసింది. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోయిన మీపైనా, మీకుటుంబంపై నాకు నమ్మకం లేదు. ఇక ప్రజలేం నమ్ముతారు.

ఇవి చేశారు తెలుసా..

ఓదార్పు యాత్రలో భాగంగా ఒకే ఒక్కసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడికి వచ్చాడు. నా నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం ఎంతగానో పరితపిస్తున్నాడు. రూ.49 కోట్లు వెచ్చించి పన్నెండేళ్ల పుష్కరాల పండుగను కనీవిని ఎరుగని రీతిలో జరిపించాడు. అధికారంలోకి వచ్చీ రాగానే పులికనుమ ప్రాజెక్టును పూర్తిచేసి రైతన్నలకు సాగు నీరందించాడు.

- కొత్తగా కోసిగి ప్రజల కోసం మిగులు బడ్జెట్ రూ.3 కోట్లతో ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.
- మూడేళ్ల క్రితమే ఆర్డీఎస్ కుడిగట్టు కాలువ పనులు ప్రారంభించారు.
- రూ.73 కోట్లతో 52-బసాపురం, ఖగ్గల్, ఐరన్‌గల్లు, కందకూరు, గోతులదొడ్డి, కోసిగి ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయగా.. పనులు పూర్తికావొచ్చాయి.
- రూ.45 కోట్ల వరకు వెచ్చించి రంగాపురం-తారాపురం, డి.బెళగల్-కోసిగి, జుమ్మాలదిన్నె-కోసిగి, దుద్ది-సాతనూరు, కంబలదిన్నె-కల్లుకుంట, సుంకేశ్వరి, గౌడగల్లు సీసీ రోడ్లు నిర్మించారు.
- ఒక్కో పంచాయతీకి రూ.40 లక్షల ఖర్చుతో సచివాలయ సముదాయాలు, రూ.28.50 లక్షలతో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇవేగాక మూడేళ్ల పాలనలో నియోజకవర్గంలో భవనాలు, సంక్షేమానికి రూ.2,100 కోట్ల వరకు ఖర్చు చేశారు.
- మనబడి నాడు-నేడు కింద రూ.111 కోట్లతో 178 పాఠశాలల్లో మౌలిక వసతులు, అదనపు గదుల నిర్మాణం చేపట్టారు.
- రూ.15.68 కోట్లతో ఎల్లెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టారు.
- 123 రైతు గ్రూపులకు సబ్సిడీ ట్రాక్టర్లు మంజూరు చేశారు.
- రూ.163 కోట్లు రైతు భరోసా, రూ.36 కోట్లు పంట నష్టపరిహారం, వైఎస్సార్ పంట బీమా రూ.60 కోట్లు, అమ్మ ఒడి కింద రూ.125 కోట్లు, వైఎస్సార్ ఆసరా రూ. 29.31 కోట్లు, స్త్రీనిధి రూ.30.02 కోట్లు, హౌసింగ్ ద్వారా రూ.15.68 కోట్లు, జలజీవన్ మిషన్ కింద రూ.49.40 కోట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.20 కోట్లకు పైగా వెచ్చించారు. ఇలా నవ రత్నాలతో వేలాది మందికి మేలు జరిగింది.
- ఏడాదికి ఎంత లేదన్నా సంక్షేమం కోసం రూ.700 కోట్ల మేర ఖర్చు చేస్తున్నారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు కాస్తో కూస్తో సంతోషంగా ఉన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం, సరైన సమయంలో వానలు కురవడంతో ఎంతో ఆనందంగా ఉన్నారు. మీ నాన్నారు ఏనాడూ సంక్షేమం గురించి ఆలోచన చేయలేదు. నీరు-చెట్టు కార్యక్రమంతో కేవలం తమ్ముళ్ల జేబులు నింపేశారు. తొమ్మిది ఏళ్ల తర్వాత నీవు తొలిసారిగా వస్తున్నావు. నీవైనా మాట మీద నిలబడతావో లేదో ఆ దేవుడికే ఎరుక. ఏది ఏమైనా చివరకు మీ నాన్నారుకు.. నీకు ఒక్కటే చెబుతున్నా.. మాట మీద నిలబడితేనే పదికాలాల పాటు ప్రజల దీవెనలు అందుకుంటారు. లేదంటే అదే గతి.. అధోగతే చినబాబు..

ఇట్లు
మంత్రాలయం నియోజకవర్గం

జగనన్న పాలనలోనే ప్రగతి

- వై.బాలనాగిరెడ్డి, శాసనసభ్యులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగింది. 2014-2019 వరకు టీడీపీ పాలనలో ఎలాంటి ప్రగతి సాగలేదు. టీడీపీ నాయకులు ఓట్ల రాజకీయం కోసం నాడు ఆర్డీఎస్ కుడిగట్టు కాలువ పనులకు భూమిపూజ చేశారు. అయితే తామొచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాం. రైతుల సౌకర్యార్థం రూ.73 కోట్లకు పైగా వెచ్చించి ఆరు ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తున్నాం. దాదాపు 10వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. కోసిగి, మంత్రాలయం మండల కేంద్రాల్లో రూ.కోటితో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. వైఎస్సార్ చొరవతోనే నియోజకవర్గంలో పులికనుమ ప్రాజెక్టు ఏర్పడింది. 25,400 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలనే ఉద్దేశంతో రూ.294 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు అప్రోచ్ కాలువకు రూ.30 కోట్లు కూడా ఇవ్వలేకపోయారు. కోసిగి ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో కొత్తగా లిఫ్టు ఇరిగేషన్‌తో పాటు, తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేశాం. రూ.25 కోట్లతో నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. రూ.49.40 కోట్లతో జల జీవన్ మిషన్ పనులు జరుతున్నాయి. నవరత్నాల పథకాల ద్వారా ఏటా రూ.400 కోట్ల మేర మంజూరవుతున్నాయి. హౌసింగ్ ద్వారా 9,120 ఇళ్లు మంజూరు చేశాం. ఇవేమీ తెలుసుకోని టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారు. టీడీపీ నాయకులు ఉనికి కోసం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు శాయాశక్తుల కృషిచేస్తున్నాం.

చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా జనం నమ్మరు



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేసిన ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కేవలం లేనిపోని ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని, గ్రామాల్లో జగనన్నే మళ్లీ సీఎం కావాలని జనం కోరుకుంటున్నారని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ప్రభుత్వం అందజేసిన పథకాలు, అమలు తీరు, లబ్ధి గురించి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, పప్పుబాబు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు మరోసారి చీదరించుకోవడం గ్యారెంటీ అని చెప్పారు. పప్పుబాబు చేపట్టిన యువగళం పాదయాత్రకు జనం కరువయ్యారని, గోబ్యాక్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తున్నా..ఎల్లో మీడియాలో గొప్పలు చూపిస్తున్నారంటూ మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించామని తెలిపారు. హామీల అమలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన చరిత్ర సృష్టించారని కొనియాడారు. హామీలను గుప్పించి, మోసం చేడయంలో చంద్రబాబు రికార్డు సృష్టించారని విమర్శించారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని, మళ్లీ సీఎంగా ప్రమాణస్వీకారం చేయడం పక్కా అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దానమ్మ, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంపాపతి, నాయకుడు ప్రతాప్‌రెడ్డి, ఈఓపీఆర్డీ జనార్దన్, ఆర్ఐ జయరామిరెడ్డి, వీఆర్వో చిన్న ఈరన్న, పీఆర్ఏఈ మాలిక్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, హౌసింగ్ అధికారి తిప్పన్న, మండల వ్యవసాయ అధికారి పాపిరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, వైఎస్సార్ క్రాంతి ఏపీఎం జనార్దన్, సర్పంచ్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక ట్రక్కుతో సెల్ఫీ తప్పు..

ఆదోని అర్బన్ : ఎవరో ప్రభుత్వానికి ట్యాక్స్ కట్టి ఇసుకను ట్రక్కులో తీసుకెళ్తుంటే.. క్యాష్ ప్రసాద్ ఎర్రమట్టిని తవ్వి తీసుకెళ్తున్నాడంటూ నారా లోకేష్ సెల్ఫీ దిగి ప్రచారం చేయడం తప్పు అని, అమెరికాలో నారా లోకేష్ రాసలీలలు సాగించిన ఫోటోలు వాస్తవమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సెల్‌ఫోన్‌లో లోకేష్ అమెరికాలో యువతులతో దిగిన ఫోటోలను మీడియాకు చూపించారు. తనను క్యాష్ ప్రసాద్ అంటూ అవమానించడంపై మండిపడ్డారు. సోమవారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాలు తెలుసుకొని అప్పుడు సెల్ఫీ పెట్టాలి గానీ.. ఇలా సిల్లీగా చేయడం పద్ధతి కాదన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైస్ చైర్మన్ నరసింహులు, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎండీ అన్ను, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, దేవా, బన్ని పాల్గొన్నారు.

మెజిస్ట్రేట్, పీడీఎంకు సన్మానం

ఆదోని రూరల్ : ఇటీవల బదిలీ అయిన మెజిస్ట్రేట్ శ్రీకాంత్, పీడీఎం హిమబిందు న్యామూర్తులను ఆదోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. అనంతరం పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ఆదోని కోర్టులో మూడు సంవత్సరాలుగా వారు చేసిన సేవలను కొనియాడారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం




జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మన్ నుంచి అవార్డు అందుకుంటున్న విరుపాపురం సర్పంచ్ ప్రహ్లాద్ యాదవ్, పంచాయతీ సెక్రటరీ వేణుగోపాల్‌రెడ్డి

ఆదోని రూరల్ : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో భాగంగా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సీనియర్ అసిస్టెంట్ వీరభద్రయ్య, సీనియర్ పంచాయతీ సెక్రటరీ నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. వారు మాట్లాడుతూ మండలంలోని మండిగిరికి రాష్ట్రస్థాయి గుర్తింపు రాగా, విరుపాపురం, మాంత్రికి, పాండవగల్ మూడు గ్రామ పంచాయతీలకు జిల్లాస్థాయి గుర్తింపు, మరో 13 పంచాయతీలకు మండల స్థాయిలో గుర్తింపు పొందాయన్నారు. విరుపాపురం పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ ప్రహ్లాద్‌యాదవ్ జిల్లా కలెక్టర్ సృజన, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. సురక్షిత భద్రత అవార్డు లభించిన సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ సచివాలయంలో సోమవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. వెఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి మాట్లాడుతూ మండిగిరి గ్రామ పంచాయతీకి సురక్షిత భద్రత అవార్డు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ గీతావాణి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు రాష్ట్ర అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు.

కౌతాళం: గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంను పురస్కరించుకుని స్థానిక పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యదర్శి ఆంజనేయులు, ఉప సర్పంచ్ తిక్కయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, నాయకులు వడ్డెరాము పాల్గొన్నారు.

కోసిగి: గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో కృషి చేస్తున్నానని సాతనూరు గ్రామ సర్పంచ్ మంగమ్మ పేర్కొన్నారు. సోమవారం కర్నూలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన, జిల్లా పంచాయతీ అధికారుల చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ అవార్డును అందుకున్నారు.



జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సర్పంచ్ మంగమ్మ

మద్యం రవాణా దారుల అరెస్ట్

ఆదోని రూరల్ : కడితోట గ్రామ సమీపంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇస్వీ ఏఎస్ఐ చంద్ర సోమవారం తెలిపారు. కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన బోయ నరసప్ప, బోయ నాగరాజు ఏపీ04ఎఫ్ 5778 ఎక్స్ఎల్ మోటార్ సైకిల్‌పై 350 90 ఎం.ఎల్ టెట్రా ప్యాకెట్లను తీసుకొస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

పోస్టులు భర్తీ చేయాలి

ఆదోని అర్బన్ : ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తలారి సుధాకర్, బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్ కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి డీటీకి వినతి పత్రం అందజేశారు.

క్లుప్తంగా

ఉరుకుందలో భక్తుల సందడి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహా మంగళ హారతి, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి ఫల,పుష్పాలతో అలంకరించారు.

కబడ్డీ విజేత ఆదోని ఫిలిప్స్ జట్టు

ఆదోని అర్బన్: ఈనెల 22, 23వ తేదీల్లో కౌతాళం మండలం ఉప్పరహాల్ గ్రామంలో బసవ జయంతి సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆదోనికి చెందిన ఫిలిప్స్ జట్టు పెద్దహరివాణం జట్టుపై విజయం సాధించింది. మొదటి స్థానంలో నిలిచిన ఫిలిప్స్ జట్టుకు రూ.25 వేలు, పెద్దహరివాణం జట్టుకు రూ.15 వేల నగదును బహుమతిగా అందజేశారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని అర్బన్ : పాఠశాల ప్రహరీ దాటివెళ్లి బావిలో పడి మృతిచెందడం బాధాకరమని, ఇందుకు అలక్ష్యం వహించిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసులు సోమవారం డిమాండ్ చేశారు.

ఇక నుంచి ప్రతి రోజూ 'స్పందన'

కౌతాళం: గ్రామ సచివాలయాల్లో ఇక నుంచి ప్రతి రోజూ స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో స్పందన కార్యక్రమ నిర్వహించారు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ 3 నుంచి 5గంటల వరకు ప్రతి గ్రామ సచివాలయంలో స్పందన అర్జీల్ని స్వీకరిస్తారని చెప్పారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

కోసిగి: పంచాయతీల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఈఓపీఆర్డీ ఆరూన్ రషీద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక , మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల పట్టివేత

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని నాగలదిన్నె రహదారిలోని సుంకప్పతాత దర్గా వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను మంత్రాలయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాయచూర్ జిల్లా తలమారి గ్రామానికి చెందిన బోయ శ్రీను, బోయ నరసింహులు తుంగభద్ర నదిలో మద్యం మోసుకొచ్చి సుంకప్ప తాత దర్గా దగ్గర అనుమానంగా సంచరిస్తుడటంతో అదుపులోకి తీసుకుని విచారించగా 768 కర్ణాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తున్నామని అంగీకరించడంతో కేసు నమోదు చేసి మద్యం సీజ్ చేశామని పోలీసులు చెప్పారు.

పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శం

ఆదోని అర్బన్ : సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 39 వార్డులో సోమవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు. వార్డు కన్వీనర్లు అబ్దుల్‌రషీద్, రామకృష్ణ, జరీనా, గృహసారథులు చంద్ర, రామంజి, బ్రహ్మి, ఉదయ్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోని రూరల్ : ఆరేకల్ గ్రామ సమీపంలోని బహిరంగ ప్రదేశంలో సోమవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తాలూకా ఎస్ఐ గోపాల్‌రెడ్డి విలేకరులకు తెలిపారు. వైద్యకళాశాల ఎదురుగా బహిరంగ ప్రదేశాల్లో పేకాట ఆడుతుండగా ఏఎస్ఐ మోహన్‌కృష్ణ, సిబ్బంది దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.90,340 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు.

దరఖాస్తు చేసుకోండి

కౌతాళం: అర్హత ఉండి రైతు భరోసా అందని రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ లోపు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో వ్యవసాయ అధికారులను సంబంధిత ధ్రువ పత్రాలతో సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి

ఆదోని రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని, అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తపరిచేలా చూడాలని డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, వ్యవసాయశాఖ ఏడీ గిరీష్, ఆర్‌టీసీ డిపో మేనేజర్ రఫీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, రీ సర్వే తహసీల్దార్ పెద్దయ్య పాల్గొన్నారు.

ఆదోని టౌన్ : స్పందన కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎగ్జిబిషన్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, తగ్గించాలని విద్యార్థులు వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని షేర్‌ఖాన్ కొట్టాల కాలనీలో మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం కమిషనర్, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కాలువలు, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వారికి వివరించారు. ప్రైవేట్ స్థలం కావడం వల్ల మురుగు కాలువలు ఏర్పాటు చేయలేకపోతున్నామని తెలిపారు.